క్లుప్తంగా

ఆధార్ సేవలను సద్వినియోగ పరచుకోండి



ఆధార్ నమోదు ఫారాన్ని అందిస్తున్న దృశ్యం

మునగపాక: ప్రతి ఒక్కరూ ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పాటిపల్లి సర్పంచ్ ఆడారి కృష్ణవేణి భర్త త్రిమూర్తులు కోరారు. మండలంలోని పాటిపల్లి సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సేవలను గురువారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వ, ప్రైవేట్ సేవలు పొందేందుకు ఆధార్ కార్డు ఎంతో కీలకమైందన్నారు. కార్డులో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్ కార్డుకు ఫోన్‌నంబరను అనుసంధానం చేసుకోవాలన్నారు. సచివాలయ ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ ప్రవేశాలకు ఆహ్వానం



షేక్ అల్లావుద్దీన్, హెచ్‌ఎం

కోటవురట్ల: ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్థానిక కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం షేక్ అల్లావుద్దీన్ తెలిపారు. గురువారం ఆయన తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలతో హైస్కూల్లో సంప్రదించాలని సూచించారు. దరఖాస్తులను ఈ నెల 31లోగా అందజేయాలన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ తల్లి ఉత్సవం



దుర్గాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మండలంలోని చూచుకొండలో గురువారం దుర్గాలమ్మ తల్లి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా కొత్తమ్మ తల్లి పండగ



కొత్తమ్మతల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రాంబిల్లి: పెదకలవలాపల్లి గ్రామంలో గురువారం కొత్తమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. భజనలు, కోలాటాలు, తప్పెటగుళ్లతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారి ఆలయం సహా పలు వీధుల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు.

గుడిసెల తొలగింపులో ఉద్రిక్తత

మునగపాక: మండలంలోని గంగాదేవిపేటలో చెరువు ఆక్రమణల తొలగింపు వ్యవహారం ఉద్రిక్తతకు దారితీసింది. ఒకరోజు గడువు ఇస్తే తామే గృహాలు తొలగిస్తామని చెప్పడంతో అధికారులు వెనుదిరిగారు. గంగాదేవిపేట గ్రామంలోని చెరువు స్థలం కొంత ఆక్రమణకు గురైనట్లు అందిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ సిబ్బంది గురువారం జేసీబీతో సంఘటనాస్థలికి చేరుకున్నారు. ఆక్రమిత స్థలంలో గుడిసెలు నిర్మించడంతో వాటిని తొలగించాలని అధికారులు హెచ్చరించారు. కొంతసేపు అధికారులకు, ఆక్రమణ దారులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. జేసీబీ చుట్టూ ఆక్రమణ దారులు భీష్మించుకుని, తమకు గడువు ఇవ్వాలని కోరడంతో అధికారులు వారికి గుడిసెలు తొలగించేందుకు ఒకరోజు గడువిచ్చారు. దీంతో ఆందోళన సద్దుమణిగింది.

కాలమేదైనా 'పొదుగువాపు' ప్రమాదకరం

వ్యవసాయం కలిసి వచ్చినా, రాకున్నా పాడి పరిశ్రమ రైతుకు ఓ భరోసాగా మారుతోంది. ప్రతి నెలా స్థిరమైన ఆదాయంతో ఇంటి ఖర్చులు, పిల్లల చదువుల వ్యయం గడిచిపోతోంది. ఇంతగా ఆదుకుంటున్న పాడి సంరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే నష్టం భారీగా ఉంటుంది. ప్రస్తుతం పొదుగువాపు(మాస్టైటిస్) వ్యాధి పాడి పశువుల్లో ఎక్కువగా వ్యాపిస్తోంది. దీనిపై అప్రమత్తంగా ఉండాల్సిందిగా పశువైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



వ్యాధి సోకిన పాడి ఆవు

- పాడి పశువుల్లో విస్తరిస్తున్న పొదుగువాపు వ్యాధి
- పరిశుభ్రత, ముందు జాగ్రత్తే మేలు
- పశువైద్య నిపుణులు

కోటవురట్ల: పాడి పశువుల సంరక్షణలో ముందు జాగ్రత్తలు తీసుకుంటే రైతు ఆదాయానికి లోటుండదు. పాడి పశువుల్లో కొన్ని వ్యాధులు సీజనల్‌గా వస్తాయి. మరికొన్ని కాలం ఏదైనా పశువుల్లో వ్యాపించి, నష్టాన్ని కలిగిస్తాయి. ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయి. దీంతో మనుషులతో పాటు పాడి పశువులకు రోగాలు ముసురుకునే అవకాశం ఉంది. పాడి పశువులకు వచ్చే వ్యాధుల్లో ఒకటైన పొదుగు వాపు వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే తీవ్ర నష్టం తప్పదు. పాల ఉత్పత్తి తగ్గిపోవడమే కాకుండా ఒక్కోసారి పశువులు మృతి చెందే ప్రమాదం ఉంది.

పొదుగువాపు వ్యాప్తి కారకాలు

పొదుగు వాపు వ్యాధి సాధారణంగా పాల ఉత్పత్తి ఎక్కువగా ఉన్న పశువులు, సంకర జాతి పశువులకు సోకుతుంది. ఈ వ్యాధికి కాలం అంటూ ఏదీ లేదు. పాలిచ్చే ఏ పశువుకైనా ఏ సమయంలో అయినా రావొచ్చు. పాలు పితికేటపుడు గోళ్లు తగిలి పుండ్లు పడడం వల్ల, పాలు తాగేటపుడు దూడ దంతాలు తగిలి గాయాలు ఏర్పడి పుండ్లుగా మారి సూక్ష్మజీవులు పొదుగులోకి ప్రవేశించడం ద్వారా వ్యాధి సంక్రమిస్తుంది. పొదుగుకు చిన్న గాయమైనా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. మురికిగా ఉన్న చేతులతో పాలు పితికినా వ్యాధి సోకుతుంది.

వ్యాధి లక్షణాలు : వ్యాధి బారిన పడిన ఆవులు, గేదెల పొదుగు, చన్నులు వాచిపోతాయి. పొదుగు వేడిగా ఉండి ముట్టుకోగానే పశువులు బాధతో విలవిల్లాడిపోతాయి. పొదుగు గట్టిగా మారిపోతుంది. ఈ వ్యాధి ఒకటి లేదా అన్ని చన్నులకు వచ్చే అవకాశం ఉంది. వ్యాధి బారిన పడిన పశువులు పాలు పితికినపుడు నీరులా ఉండి, తక్కువ మోతాదు పాలను మాత్రమే ఇస్తాయి. ఒక్కొక్కసారి పాలధారలో రక్తపు బొట్లు కూడా వస్తాయి. జ్వరం సోకడంతో మేత తగ్గిపోయి నీరసించిపోతాయి.

వ్యాధి నివారణ చర్యలు

పశువుల పాకలను ఎప్పటికపుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వీలైనంత పొడిగా ఉండేలా చూసుకోవాలి. పశువులను శుభ్రంగా కడుగుతూ ఉండాలి. పాలు పితికే ముందు గోరువెచ్చని నీళ్లతో పొదుగును కడిగి, శుభ్రమైన గుడ్డతో తుడవాలి. పాలు పితికేవారి చేతులకు గోళ్లు లేకుండా జాగ్రత్త పడాలి. పొదుగులో పాలు ఉంచకుండా మొత్తం పితికేయాలి. గర్భ కోశ వ్యాధి ఉన్న పశువులు, ఈనిన పశువులకు చెందిన మానం నుండి కారే రక్తం, చీము, స్రవాలను పొదుగుకు తాకకుండా గోరువెచ్చటి నీటితో శుభ్రపరుస్తూ ఉండాలి.

వెంటనే చికిత్స చేయించాలి

రైతులు ఎప్పటికపుడు పశువులను పరిశీలిస్తూ కొత్తగా ఏమైనా మార్పులు కనిపించినా, వ్యాధి లక్షణాలు తెలిసినా వెంటనే చికిత్స చేయించాలి. వ్యాధి సోకిన పశువులకు యాంటీబయోటిక్ మందులతో చికిత్స చేయించాలి. ఇలాంటి పశువులను మిగతా పశువుల నుంచి వేరు చేయాలి. సకాలంలో వ్యాధులను చికిత్స చేయించడం ద్వారా నష్టాన్ని నివారించవచ్చు.

– సింహాద్రప్పుడు, ఏడీ, పశు సంవర్ధక శాఖ

ఘనంగా అమ్మవార్ల జాతర



పట్టాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు



కొరుప్రోలు మరిడిమాంబ గరగల ఊరేగింపు

యలమంచిలి: యలమంచిలి మండలంలోని బయ్యవరం గ్రామంలో ఉన్న పట్టాలమ్మతల్లి, కొత్త యర్రవరం గ్రామ దేవత పోలిమేరమ్మతల్లి జాతర మహోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. పట్టాలమ్మ తల్లి ఆలయానికి ఉదయం నుంచే మహిళలు పెద్ద ఎత్తున తరలివెళ్లి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. బయ్యవరం, పద్మనాభరాజుపేట, ములకలాపల్లి గ్రామాల నుంచి భక్తులు భారీగా పాల్గొని, అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ప్రతిమను గ్రామంలో ఊరేగించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా కమిటీ సభ్యులు అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మొగలిపల్లి సత్యన్నారాయణ, గొన్నాబత్తులశివ, ఊటకూటి శేఖర్, గొన్నాబత్తుల నాగేశ్వరావు, మాజీ సర్పంచ్ గంజి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు మొగలపల్లి గణేష్, చంద్రగిరి శ్రీను, నాని, గెంజి రమణ జోగి, జెర్రిపోతులు వెంకట్, పి.లోవరాజు, గెంజి రాము, నక్కిన మనేష్ శ్రీను, కొండల రావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

- కొత్త యర్రవరం గ్రామ దేవత పోలిమేరమ్మతల్లి జాతర సందర్భంగా విద్యుద్దీపాలంకరణలో ఆలయ పరిసరాలు వెలుగులీనాయి. ఉదయం నుంచే పట్టణ ప్రజలతోపాటు, యర్రవరం ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద సాయంత్రం భారీ బాణసంచా కాల్చారు. పలువురు రాజకీయ నాయకులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎస్.రాయవరం: వమ్మవరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారి జాతర గురువారం కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామ ఇలవేల్పుగా కొలిచే అమ్మవారికి సంప్రదాయం మేరకు ఏటా మాదిరే ఈ ఏడాది కూడా భక్తి శ్రద్ధలతో జాతర జరిపారు. వేకువజాము నుంచి అమ్మవారికి భక్తులు పసుపు కుంకుమలు, చీర, సారెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక యువకులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేసి, తమ భక్తిని చాటుకున్నారు. రాత్రికి గ్రామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి.



పూజలందుకుంటున్న వమ్మవరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు

ఘనంగా మరిడిమాంబ జాతర

కొరుప్రోలు గ్రామంలో శ్రీ మరిడిమాంబ జాతర ఘనంగా నిర్వహించారు. యాదవ కుల సభ్యులు ఉత్సవ కమిటీ సమక్షంలో భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అమ్మవారి గరగను ఊరేగింపు నిర్వహించారు.

వైభవంగా మరిడిమాంబ పండగ



కోటవురట్లలో అమ్మవారి ఆలయంలో భక్తులు



అలరించిన గరగల నృత్యం

కోటవురట్ల: మండలంలోని పలు గ్రామాలలో గురువారం గ్రామ దేవతల జాతరలు హోరెత్తాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు సందడి చేశారు. మండల కేంద్రంలో శ్రీ మరిడిమాంబ అమ్మవారి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జాము నుంచి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షణ చేశారు. తీర్థ ప్రసాదాల్ని అందించారు. కోలాటం, గరగల డ్యాన్స్ ఆకట్టుకున్నాయి. విద్యుద్దీపాలంకరణలో గ్రామం మెరిసిపోయింది. కె.వెంకటాపురంలోనూ మరిడిమాంబ జాతరను ఘనంగా నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మార్కెట్‌కు శ్రావణశోభ



జనాలతో రద్దీగా ఉన్న యలమంచిలి మార్కెట్

యలమంచిలి: శ్రావణమాసం రెండవ శుక్రవారం సందర్భంగా యలమంచిలి పట్టణ మార్కెట్ గురువారం కొనుగోలుదారులతో రద్దీగా మారింది. ప్రధాన రహదారిలో వస్త్ర దుకాణాలు, పూలు, పండ్ల దుకాణాలు, బంగారం షాపులు మహిళలతో కిక్కిరిసిపోయాయి. ప్రధాన రహదారిపై జనాల రద్దీ అధికంగా ఉండటంతో యలమంచిలి పట్టణ, ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు.

మునగపాకలో వాహన తనిఖీలు

మునగపాక: ప్రతి వాహనదారుడు తమవెంట రికార్డులు ఉంచుకోవాలని ఎస్‌ఐ మహమ్మద్ ఆలీ సూచించారు. మునగపాక మెయిన్‌రోడ్డులో గురువారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి రికార్డులు లేకుండా వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేశారు. హెల్మెట్ వినియోగించాలని, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌తో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హితవు పలికారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షం.. రోడ్లు జలమయం



నక్కపల్లిలో ఈదురు గాలులతో భారీ వర్షం



బిగ్‌బజార్ సమీపంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లిలో గురువారం భారీ వర్షం పడింది. సాయంత్రం, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడటంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నక్కపల్లి, ఉపమాక చినదొడ్డిగల్లు తదితర ప్రాంతాల్లో వర్షం పడటంతో రోడ్లపైన రాకపోకలకు ఇబ్బంది కలిగింది. వీవర్స్‌కాలనీ, ఉపమాక వెంకటన్న ఆలయ ప్రాంతం, నక్కపల్లి ఏరియా ఆస్పత్రి, తహసీల్దార్, మండలపరిషత్ కార్యాలయాల వద్ద భారీగా వర్షపు నీరు చేరింది. రోడ్లు పొంగి ప్రవహించాయి. ఈ వర్షం వరి నాట్లకు బాగా ఉపయోగపడుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్.రాయవరం: వర్షానికి అడ్డురోడ్డులో రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. బిగ్ బజార్ సమీపంలో రోడ్లు అసంపూర్తిగా వేసి, డ్రైనేజీకి కలపక పోవడంతో గురువారం కురిసిన వర్షపు నీరు, స్థానిక వ్యాపార సముదాయాల నుంచి వచ్చిన నీరు లోతట్టుగా ఉన్న రోడ్డుపై నిలిచిపోతోంది. శ్రీ ఆదర్శ పాఠశాల సమీపంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఓ మోస్తరు వర్షం కురిసినా ఈ రోడ్లపై నీరు నిలిచి రోజుల తరబడి ఉండిపోతుందని వాహన చోదకులు చెబుతున్నారు. ఇకనైనా పంచాయతీ సిబ్బంది దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్షణిక సుఖాల కోసం రోగాల బారిన పడొద్దు

పాయకరావుపేట: మండలంలోని పెంటకోట గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో గురువారం స్టాల్ యాక్టివిటీ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జోనల్ సూపర్‌వైజర్ డి.రమణ, లింక్ వర్కర్ జీసీహెచ్ నర్సింగరావు పాల్గొని హెచ్‌ఐవీ, సుఖ వ్యాధుల గురించి ఐఈసీ మెటీరియల్ ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. క్షణిక సుఖాల కోసం దీర్ఘకాలిక రోగాల బారిన పడవద్దని హెచ్చరించారు.



లింక్ వర్కర్స్ స్కీం సిబ్బంది అవగాహన కార్యక్రమం

జయ జయహో.. చంద్రయాన్



అచ్యుతాపురం కూడలిలో మానవహారం చేస్తున్న విద్యార్థులు

అచ్యుతాపురం(అనకాపల్లి): చంద్రయాన్ ప్రయోగం విజయవంతమైన నేపథ్యంలో కైట్స్ జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారం అచ్యుతాపురం జంక్షన్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మానవహారం నిర్వహించి, శాస్త్రవేత్తల కృషిని అభినందిస్తూ నినాదాలు చేశారు. జయహో భారత్, జయహో చంద్రయాన్ అంటూ జేజేలు కొట్టారు. ఇస్రో ప్రయోగించిన ర్యాకెట్‌తో కూడిన ఫ్లెక్సీలు, జాతీయ జెండాలు ప్రదర్శించారు.

త్వరితగతిన సచివాలయ నిర్మాణం

రాంబిల్లి: సచివాలయ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని పీఆర్ ఈఈ కె.నాగేష్ బాబు సూచించారు. నిర్మాణంలోవున్న కట్టుబోలు సచివాలయాన్ని గురువారం ఆయన పరిశీలించారు. పంచదార్ల, రాజుకోడూరు గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లును తనిఖీ చేశారు. ప్రభుత్వ భవనాలను వేగవంతంగా నిర్మించాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. నిర్మాణాల్లో నాణ్యత పాటించాలన్నారు. ఈఈ వెంట మండల జేఈ ఎంఎస్ గులాబ్ ఉన్నారు.

ఇంటింటి సర్వేకు సహకరించండి

పాయకరావుపేట : గ్రామ పంచాయితీ పరిధిలో ఇంటింటి సర్వేకు గ్రామస్తులు సహకరించాలని పాయకరావుపేట గ్రామ కార్యదర్శి జె.చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా సిబ్బంది ఇంటింటికి వచ్చి సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సర్వే సిబ్బందికి ఇంటి డాక్యుమెంట్, ఇంటి పన్ను రసీదు, ఇతర డాక్యుమెంట్లు చూపించి సహకరించాల్సిందిగా కోరారు.

వలస కార్మిక చట్టాల అమలుకు వినతి

అచ్యుతాపురం(అనకాపల్లి): వలస కార్మికుల చట్టాన్ని అమలు చేసి, మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని సీఐటీయూ నాయకులు ఏపీఐఐసీ జెడ్‌ఎం త్రినాథ్‌ను కోరారు. ఈ మేరకు సీఐటీయూ నాయకులు గురువారం ఆయనకు వినతి పత్రం అందించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము మాట్లాడుతూ వలస కార్మికుల్ని 50 మంది చొప్పున ఒకే షెడ్‌లో ఉంచి, కనీస వసతులు కల్పించడం లేదన్నారు. కార్మికుల మృతిపై విచారణ జరిపి బాధ్యుల్ని శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధి కె.సోము నాయుడు పాల్గొన్నారు.



త్రినాథ్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

అందరి సహకారంతో బాల్య వివాహాల నియంత్రణ

నక్కపల్లి: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీడ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి కైలాస్ సత్యార్థి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లలితలు కోరారు. గురువారం నక్కపల్లి బాలికల పాఠశాలలో బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండే వరకు ఆడపిల్లలకు వివాహాలు చేయరాదన్నారు. అలా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. నిరక్షరాస్యులైన తల్లిదండ్రులకు ఈ విషయాన్ని విద్యార్థులు తెలియజేయాలని సూచించారు. వివాహ వయసు రాకుండా పెళ్లిల్లు చేస్తే తలెత్తే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నియంత్రణ చర్యలపై ప్రభుత్వం గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తోందన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు గ్రామాల్లో బాల్య వివాహాలపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో సీడ్ సిబ్బంది అమ్మాజీ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు

కశింకోట : స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక కుంకుమార్చనలు, పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి వి. కృష్ణ తెలిపారు. ఉదయం నుంచి సహస్రనామాలు, అష్టోత్తర శతనామావళి అర్చనలు జరుగుతాయన్నారు. అలాగే స్థానిక శివాలయంలో సర్వమంగళాంబకు సాయంత్రం ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు వి. శంకరం, వి. చిదంబరం తెలిపారు.

రూ.30 లక్షలతో కొత్తూరులో సీసీ డ్రైయిన్ నిర్మాణం

అనకాపల్లి రూరల్ : మండలంలోని కొత్తూరు మేజర్ పంచాయతీలో రూ.30 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్ పనులకు గురువారం ఎంపీపీ గొర్లి సూరిబాబు, జిల్లా పరిషత్ వైస్ చెయిర్‌పర్సన్ బీశెట్టి వరాహ సత్యవతి గురువారం శ్రీకారం చుట్టారు. ఎంతో కాలంగా కొత్తూరులో ప్రధాన డ్రెయిన్ పనులు జరగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే ప్రధాన వీధుల్లో మురుగు నీరు నిల్వ ఉండిపోతోంది. దీని వలన గ్రామంలో పారిశుధ్య సమస్య తీవ్రమవుతోంది. గురువారం ఇక్కడ ప్రధాన కాల్వ నిర్మాణ పనులకు బీజం పడటంతో పనులు పూర్తయితే మురుగునీటి అవాంతరాలు లేకుండా ప్రవహించడానికి ఆస్కారం ఉంటుందని స్థానిక ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వాలన్నీ తమ గ్రామ సమస్యలపై నిర్లక్ష్యం చూపగా ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలతో పాటు ఏళ్ల నాటి ప్రధాన సమస్యల పరిష్కారానికి మోక్షం కలుగుతోందని, ఇందుకు కృషి చేసిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు ఈ సందర్భంగా స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కొత్తూరు గ్రామ సర్పంచ్ సప్పారపు లక్ష్మీ ప్రసన్న, వరహాలరావు, బీశెట్టి జగన్, బుజ్జి, చలం, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.



కొత్తూరులో సీసీ డ్రైయిన్ పనులకు శ్రీకారం చుడుతున్న ఎంపీపీ, ప్రజాప్రతినిధులు

పీఆర్టీయూ మండల శాఖ ఎన్నిక

పాయకరావుపేట: మండలంలోని ఉపాధ్యాయ సంఘం పీఆర్టీయూ మండల శాఖ ఎన్నిక గురువారం పట్టణంలో జరిగింది. సంఘం నాయకులు రాపర్తి వీరభద్రరావు, పి.ఉమామహేశ్వరరావుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మండల అధ్యక్షుడిగా ఆడపా వెంకట సూర్యనారాయణ, జనరల్ సెక్రటరీగా పోలవరపు హరికృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ సమావేశంలో పీఆర్టీయూ సంఘం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పీఆర్టీయూ నేతలు

నేడు బాబా మందిరం దశమ వార్షికోత్సవం

కశింకోట : మండలంలోని పల్లపు సోమవరంలో వెలసిన షిర్డీ సాయిబాబా మందిరం దశమ వార్షికోత్సవం శుక్రవారం పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త గొంతిన శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, హోమం నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం జరపనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం భక్తులకు, సమీప గ్రామాల నుంచి వచ్చే వారికి భారీ అన్న సమారాధన ఉంటుందన్నారు. సాయంత్రం మేళతాళాల మధ్య స్వామి వారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, సాయిబాబా భజన బృందంతో భజన, రేలా రే రేలా వంటి సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

స్టార్టప్‌ల ఏర్పాటుకు నైపుణ్యం తప్పనిసరి



స్టార్టప్‌లపై జరిగిన సదస్సులో పాల్గొన్న డైట్ అధ్యాపకులు, విద్యార్థులు

తుమ్మపాల : సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం ఇన్నోవేషన్ ఆవశ్యకత గురించి వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు డైట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు తెలిపారు. ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో డైట్ స్టూడెంట్ చాప్టర్, ఇన్నోవేషన్ స్టార్టప్‌లపై గురువారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు భవిష్యత్‌లో స్టార్టప్‌లు ఏర్పాటు చేసే విధంగా నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. విభాగాధిపతి ఎ.దేవీప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థి ఆచరణాత్మక విద్యను అభ్యసించాలని, తద్వారా మాత్రమే కొత్త ఆవిష్కరణలకు నాంది పలకగలరన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్స్ డీన్ కె.పార్వతి, డైట్ ఐఈఐ కన్వీనర్ హేమంత్‌కుమార్, రిసోర్స్‌పర్సన్ మద్ది గంగాధర్‌గుప్తా, అకడమిక్స్ అసోసియేట్ డీన్ ఎ.కృష్ణనాగ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.